క్లుప్తంగా

సర్వసభ్య సమావేశం వాయిదా

మల్హర్: మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిద పడినట్లు ఎంపీడీఓ శ్యామ్‌సుందర్ తెలిపారు. ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు అధ్యక్షత నిర్వహించే సమావేశానికి ముగ్గురు హాజరు కావాల్సి ఉంది. ఈ సమావేశానికి ఎంపీపీతో పాటు వల్లెకుంట ఎంపీటీసీ నాగమణి మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం లేక సమావేశాన్ని వాయిద వేసినట్లు ఎంపీడీఓ ప్రకటించారు.

దుస్తుల పంపిణీ



వాజేడు: మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో గురువారం గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో జీఎస్ఎస్ డే కేర్ సెంటర్‌లోని విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. డే కేర్ సెంటర్ సిబ్బంది, పాస్టర్ కంతి శ్యామ్ 62 మంది విద్యార్థులకు దుస్తులను అందించారు. ఈ కార్యక్రమంలో పార్వతి, నవీన్ ఉన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ



గోవిందరావుపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, పస్రాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాలను పస్రా సీఐ శంకర్, ఎస్సై కమలాకర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు మాస్ కాపీయింగ్ పాల్పడకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని, పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు.

బాల్య వివాహంపై అధికారుల కౌన్సెలింగ్

మొగుళ్లపల్లి: మండలంలోని ఓ గ్రామంలో గురువారం బాల్య వివాహం నిర్వహిస్తున్నారనే విషయం తెలుసుకున్న అధికారులు గ్రామానికి చేరుకున్నారు. అప్పటికే వివాహం జరిగిపోయింది. దీంతో అధికారులు బాలికకు వివాహం చేస్తే జరిగే పరిణామాల గురించి బాలిక బంధువులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం చైల్డ్ అధికారులు ఆ బాలికను వరంగల్ సఖీ సెంటర్‌కు తరలించి బాలికతో పాటు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం.

రానున్నది మళ్లీ బీజేపీ ప్రభుత్వమే

చిట్యాల: కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వమే వస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్‌గౌడ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ పార్లమెంట్ పార్టీ అభ్యర్థి ఆరూరి రమేష్ విజయానికి బూత్‌స్థాయి నుంచి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని అన్నారు.

నేతకాని కులస్తులకు క్షమాపణ చెప్పాలి

మంగపేట: పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో నేతకాని కులస్తులను కించపరిచే విధంగా మాట్లాడిన గుమ్మడి కుమారస్వామి వెంటనే క్షమాపణ చెప్పాలని నేతకాని మహార్ కుల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంతారావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేతకాని కులానికి నీతి జాతి లేదని, మీ కులానికి చరిత్ర ఎక్కడిదని కుమారస్వామి మాట్లాడటం దారుణమన్నారు. సమావేశంలో చప్పిడి వెంకటేశ్వర్లు, పూసల నర్సింహారవు, సాంబయ్య, ప్రసాద్, బాబు, భిక్షపతి, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



పలిమెల: మండల కేంద్రంలోని జనగామ కవిత కీళ్ల వాతంతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. కుటుంబ సభ్యులు ఆర్థిక సాయం కోసం మంత్రి శ్రీధర్‌బాబును కోరగా సీఎంఆర్‌ఎఫ్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఈ మేరకు గురువారం కవిత కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఎల్‌ఓసీ అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ పరిస్థితిని అర్థం చేసుకొని వెంటనే సాయం అందించిన మంత్రి శ్రీధర్‌బాబుకు ధన్యవాదాలు తెలిపారు.

వనదేవతకు ప్రత్యేక పూజలు



అమ్మవార్ల ఏల్పుల జెండా కర్రతో గోదావరి వద్దకు వెళ్తున్న పూజారులు



గోదావరి నదివద్ద పూజలు చేస్తున్న ప్రధాన పూజారి రామకృష్ణ

మంగపేట: మండలంలోని వాగొడ్డుగూడెం సమీపంలోని గండొర్రెగుట్టపై పూజారులు, వడ్డెలు గిరిజన సాంప్రదాయబద్ధంగా వనదేవతకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనర్సాపురం శ్రీ నాగులమ్మ ఆలయంలో సుంకు పండుగ (నిండు జాతర) మూడవ రోజు కార్యక్రమంలో భాగంగా ఆలయంలోని నాగులమ్మ అమ్మవారికి ఆలయ ప్రధాన పూజారి(నాగులమ్మ ఉపాసకుడు) ఆలయ ట్రస్టీ బాడిశ రామకృష్ణ స్వామి, పూజారి బాడిష నాగరమేష్ ఆధ్వర్యంలో ఆదివాసీ గిరిజన సాంప్రదయబద్ధంగా పూజలు నిర్వహించారు. పూజారులు, వడ్డెలు ఉదయం ఆలయ సమీపంలోని గండొర్రెగుట్టపై నాగులమ్మ మణిరూపంలో కొలువై ఉన్న ప్రాంతానికి చేరుకుని అమ్మవారికి సంబంధించిన పడ(గుహ)వద్ద శుద్ధిచేసి పసుపు కుంకుమలతో అలంకరించి రహస్య పూజలు నిర్వహించారు. ఆలయంలో గద్దెలపై ప్రతిష్ఠించిన అమ్మవారి ప్రతి రూపాలయిన ఏల్పుల జెండా కర్రలను డోలువాయిద్యాలతో వాడగూడెం వద్ద గల పవిత్ర గోదావరి నదిలో ఏడుజలకం బావులు(చెలిమలు)తీసి పసుపు కుంకుమ, పూలు, పత్రాలతో పూజారులు పూజలు నిర్వహించారు. అనంతరం పవిత్ర గోదావరి జలాలతో స్నానాలు ఆచరించి తిరిగి ఆలయానికి చేర్చారు. జాతర కార్యక్రమంలో భాగంగా ఆదివాసీ మహిళలు, యువతులు ప్రదర్శించిన థింసా నృత్యాలు అలరించాయి. జాతరలో ప్రధాన ఘట్టమైన సుంకు పండుగను రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, వడెడ్లు సోడి సత్యం, ముయబోయిన శివ, కుర్సం పుల్లయ్య, ఈసం సమ్మక్క, కొర్స శ్రీకాంత్, చౌళం భవాణి, కట్టం సమ్మక్క, తుర్స చిన్నబ్బాయి, సోడి శ్రీను, ఇర్ప రామకష్ణ, కొమరం ధనలక్ష్మి, పాపారావు, కుల పెద్దలు కుర్సం విష్ణుమూర్తి, మడకం రాజేశ్వరరావు, కొర్స ముసలయ్య, కారం సాంభయ్య, మడకం రమేష్, కుర్సం నరేష్, తదితరులు పాల్గొన్నారు.

పొలాల వద్ద విద్యుత్ తీగల ఏర్పాటు

● షాక్‌కు గురై యువకుడికి గాయాలు



వైద్యం పొందుతున్న అభినయ్

వాజేడు: పంట పొలాల వద్ద పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తాకి షాక్‌కు గురై యువకుడికి గాయాలైన సంఘటన మండలంలోని చింతూరులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. విద్యుత్ ఏఈ అర్షద్ అహ్మద్, ఎస్సై వెంకటేశ్వరరావు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోవిందరావుపేట మండల పరిధిలోని చల్వాయి గ్రామానికి చెందిన అభినయ్ వాజేడు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో ఉంటున్న అమ్మమ్మ వాళ్ల ఇంటికి వచ్చాడు. బుధవారం రాత్రి పని నిమిత్తం ట్రాక్టర్‌పై వెళ్లి వస్తున్న క్రమంలో చింతూరు వద్దకు రాగనే మూత్ర విసర్జనకు కిందకు దిగాడు. కాగా, సమీపంలో ఉన్న కన్నెబోయిన సమ్మయ్య అనే రైతు తన ఇంటి వద్ద సాగు చేసిన మొక్కజొన్న పంటను కాపాడుకోవడానికి కంచెలో విద్యుత్ తీగెలను ఏర్పాటు చేశాడు. ఆ విషయం తెలియని అభినయ్ కంచెకు తగలగానే షాక్‌కు గురయ్యాడు. అతని రెండు కాళ్లకు తీవ్ర గాయాలైయ్యాయి. గాయపడ్డ యువకుడిని వైద్యం నిమిత్తం వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యం పొందుతున్నప్పటికీ అభినయ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాగా, ఈ ఘటనపై ఏఈ అర్షద్ అహ్మద్, యువకుడి బాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ తీగెలు అమరిస్తే కఠిన చర్యలు

పంట చేల చుట్టూ, ఇతర ప్రాంతాల్లో విద్యుత్ తీగెలు అమరిస్తే చట్ట పరంగా కఠిన చర్యలను తీసుకుంటామని ఎస్సై వెంకటేశ్వరరావు హెచ్చరించారు. అడవి జంతువుల నుంచి పంటలను కాపాడు కోవడానికి అనే కారణంతో పంట చేల చుట్టూ విద్యుత్ తీగెలను అమర్చడంతో ప్రజల ప్రాణాల మీదకు వస్తుందని చెప్పారు.

పరామర్శ

చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన తీగల అనిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి గురువారం పరామర్శించారు. పదవ తరగతి పరీక్షలు రాస్తున్న మృతురాలి కూతురు సహస్ర, కుమారుడు వరుణ్‌లకు ధైర్యం కల్పించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు చింతల రమేష్, కర్రె అశోక్‌రెడ్డి, పుల్లూరు సతీష్, కానుగుల కొమురయ్య, పువ్వాటి హరికృష్ణ, గురుకుంట్ల కిరణ్, ఉప్పుల కిరణ్, సైకిలాబ్, కుమార్, సంతోష్, శ్రీదేవి, రాజమల్లు, నంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



108లో వాహనంలో క్షతగాత్రులు

కన్నాయిగూడెం : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని ముప్పనపల్లి పెట్రోల్ బంక్ వద్ద గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం బోర్లగూడెం గ్రామానికి చెందిన పి.కిరణ్, లక్ష్మణ్, సందీప్ ముగ్గురు వాజేడు మండలం కడేకల్ గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి ద్విచక్రవాహనంపై వస్తున్న క్రమంలో ముప్పనపల్లి గ్రామంలోని బోరుగూడెం వద్ద రోడ్డుపై ద్విచక్రవాహనాన్ని ఆపి మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలో తుపాకుల గూడెం ఏరియా నుంచి వస్తున్న కారు ఆగి ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనంలో ఏటూరునాగారం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించినట్లు తెలిపారు. వేగంగా బైక్‌ను ఢీకొట్టిన కారు డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఏటూరు గ్రామస్తులకు సమాచారం ఇచ్చి పట్టుకున్నారు. కారు ఏటూరునాగారానికి చెందినదిగా గుర్తించారు.

రైతు ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే



పరామర్శిస్తున్న సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి : రైతుల ఆత్మహత్యలను ప్రభుత్వ హత్యలుగా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అభివర్ణించారు. మండలంలోని ఆసరవెల్లి గ్రామానికి చెందిన రైతు నూనావత్ నవీన్ ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే పరామర్శించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి, విద్యుత్ సరఫరాలో మోసపూరితంగా వ్యవహరిస్తుండడంతో పంట దిగుబడి తగ్గి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తొలుత మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.25 వేల సాయం అందజేశారు. నవీన్ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, నల్లబెల్లి పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి మోహన్‌రావు, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి, నాయకులు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, పాలెపు రాజేశ్వర్‌రావు, అజ్మీర తిరుపతి, అజ్మీర బాసు, అజ్మీర వీరన్న, బాదావత్ బాలు, బానోత్ రాంచరణ్, కేలోత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఇండియా కూటమి గెలుపే లక్ష్యం'



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి భిక్షపతి

దామెర : ఇండియా కూటమి గెలుపే లక్ష్యంగా శ్రేణులు పని చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కోరారు. మండలంలోని ఓగ్లాపూర్‌లో గురువారం నిర్వహించిన పార్టీ మండల సమితీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ ఏటా రెండు కోట్ల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి కేంద్రంలో గద్దెనెక్కి పదేళ్లుగా ఉన్న ఉద్యోగాలు తొలగిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని, ప్రజాధనాన్ని కార్పొరేట్ శక్తులకు దోచిపెడోతందని ధ్వజమెత్తారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని ప్రజలను కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న తప్పుడు విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. అలాగే ఇండియా కూటమి అభ్యర్థులను లోక్‌సభ ఎన్నికల్లో గెలిపించేలా కృషి చేయాలని చెప్పారు. సమావేశానికి జిల్లా సమితి సభ్యుడు కొట్టెపాక రవి అధ్యక్షత వహించగా మండల కార్యదర్శి అంబి సాంబయ్య, నాయకులు దండు భాస్కర్, ఎడ్ల మంజూల, అమ్మ సాంబయ్య, గంధం శోభ, జయ, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాచైతన్యంతోనే నేరాల నివారణ

దుగ్గొండి : ప్రజాచైతన్యంతోనే నేరాల నివారణ సాధ్యమని సీఐ రాజగోపాల్ స్పష్టం చేశారు. మండలంలోని నాచినపల్లిలో గురువారం రాత్రి పోలీస్ కళాజాత నిర్వహించారు. ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, తదితరాలపై పోలీస్ కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ రాజగోపాల్ మాట్లాడారు. దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న తరుణంలో సమాజంలో సమస్యలూ పెరుగుతున్నాయని చెప్పారు. ప్రజలు సమాజంలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై అవగాహన పెంచుకుని పరిష్కారం సులువవుతుందని తెలిపారు. పిల్లలు సెల్‌ఫోన్ వినియోగిస్తున్న తీరుపై తల్లిదండ్రులు కన్నేసి ఉంచాలని, లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మతవిద్వేశాలకు పాల్పడవద్దని, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయొద్దని, వాహన చోదకులు తప్పనిసరగా హెల్మెట్ ధరించాలని, తదితర సూచనలు చేశారు. నేరాల నిర్మూలన, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీస్ కళాజాత ద్వారా ప్రదర్శనలు ఇస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా ప్రజలు శాంతియుతంగా, అవగాహనతో ఎదుర్కోవాలని చెప్పారు. ప్రజలను స్నేహితుల్లా భావించాలని ఆకాంక్షించారు. సమసమాజ నిర్మాణంలో ప్రజాచైతన్యమే కీలకమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సై జక్కుల పరమేష్, కళాజాత బృందం సభ్యులు నాగమణి, రత్నాకర్, అశోక్, వీరస్వామి, నారాయణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ధర్నా

నర్సంపేట : దళిత సామాజికవర్గానికి చెందిన ధర్మారపు ప్రకాశ్‌పై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్ మాట్లాడారు. మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామానికి చెందిన ధర్మారపు ప్రకాశ్‌పై నర్సంపేటకు చెందిన వ్యక్తులు కులం పేరుతో దూషిస్తూ చితకబాదారని తెలిపారు. కాగా హనుమకొండలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రకాశ్‌ను ప్రజాసంఘాల నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు విజయ్‌కుమార్, తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంటి వీరప్రకాశ్, అందె రవి, విద్యార్థి సంఘం నాయకుడు నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

పలిమెల: మండలంలోని ముకునూర్‌లో ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామంలో కనీసం 75 మందికి పని కల్పించాలని, వేసవికాలం నేపథ్యంలో ఉదయం ఏడు గంటలకే గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ప్రారంభించాలని సూచించారు. కొలతలు మార్క్ అవుట్ రూపంలో ఇచ్చి కూలీలను ప్రోత్సహించి అధిక కూలి పొందే విధంగా చేయాలని సాంకేతిక సహాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సునీత, సాంకేతిక సహాయకులు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ముమ్మర తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న ఎస్సై రవికుమార్

మంగపేట: జిల్లా సరిహద్దులోని బ్రాహ్మణపల్లి అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద ఎస్సై గోదారి రవికుమార్ ఆధ్వర్యంలో గురువారం వాహన తనిఖీ నిర్వహించారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో పోలీసులు చెక్ పోస్టు మీదుగా వచ్చిపోయే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అనుమానితుల నుంచి వారి వివరాలు సేకరించి వదిలేస్తున్నారు. అదే విధంగా మండలంలోని ఏటూరునాగారం, బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై కమలాపురం, మంగపేట, మల్లూరు, చుంచుపల్లి, రమణక్కపేట, రాజుపేట వద్ద వాహన తనిఖీ నిర్వహించారు. నాలుగు రోజుల నుంచి కమలాపురం, మంగపేట, మల్లూరు తదితర గ్రామాల్లో బెల్టు షాపులపై దాడులు నిర్వహిస్తు మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసు నమోదు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రూ.50 వేలకు మించి వెంట తీసుకువెళ్లవొద్దని ఒకవేళ తీసుకువెళ్లాల్సి వస్తే నగదుకు సంబంధించిన రసీదులు వెంట ఉంచుకోవాలన్నారు.

పీఏసీఎస్ వైస్ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం

మల్హర్: మండలంలోని తాడిచర్ల సహకార సంఘం వైస్ చైర్మన్ మల్క సూర్యప్రకాశ్‌రావుపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. సహకార సంఘం సొసైటీలో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా ఒక డైరెక్టర్ అనారోగ్యంతో మృతి చెందగా 12 మంది డైరెక్టర్లు ఉన్నారు. వీరిలో 8మంది డైరెక్టర్లు వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టాలని జిల్లా సహకార సంఘం (డీసీఓ) శైలజకు మార్చి 1న వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు డీసీఓ శైలజ సభ్యులకు సమాచారం అందించి గురువారం తాడిచర్ల సహకార సంఘం కార్యాలయానికి ఉదయం 11 గంటలకు చేరుకున్నారు. 11:30 గంటల వరకు వేచి చూసి పాలక వర్గ సభ్యులు ఎవరు కూడా సమావేశానికి హాజరు కాకపోడంతో అవిశ్వాసం సమావేశం రద్దు చేసి, వీగి పోయినట్లు డీసీఓ ప్రకటించారు.

సీఆర్పీఎఫ్ జవాన్‌కు సన్మానం



సురేశ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సీఐ, తోటి జవాన్లు

కాటారం: సీఆర్పీఎఫ్ 58 బెటాలియన్ కాటారంలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కేరళకు చెందిన సురేశ్‌కుమార్ పదవి విరమణ వీడ్కోలు కార్యక్రమం గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో నిర్వహించారు. స్థానిక సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, తోటి జవాన్లు సురేశ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. సురేశ్‌కుమార్ సేవలను అధికారులు, తోటి జవాన్లు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

వరంగల్ సీటును సీపీఐకి కేటాయించాలి

శాయంపేట : వరంగల్ పార్లమెంట్ సీటును సీపీఐకి కేటాయించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కోరారు. మండలంలోని పెద్దకోడెపాక రెవెన్యూ శివారులోని గుడిసెవాసుల కాలనీలో గురువారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో జాతీయ, రాష్ట్ర స్థాయిలో వామపక్ష భావాలు కలిగిన వారిని ఎన్నుకుని మతతత్వ శక్తులకు అడ్డుకట్ట వేయాలని అన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు 633 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో 15నెలల నుంచి నిరుపేదలు గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వత పట్టాలు, ఇళ్లు, విద్యుత్, మౌళిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గుడిసెవాసులతో కలిసి పోరాటానికి సిద్ధమతామని హెచ్చరించారు. అనంతరం మండల స్థాయి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా బత్తిని సదానందం, సహాయ కార్యదర్శిగా అనుకారి అశోక్, సముద్రాల రవితో పాటు 23మందితో మండల కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, సీనియర్ నాయకులు ఎండీ.ఉస్మాన్‌పాషా, పన్నాటి రాంబాబు, రాములు, రమేష్, గౌసియా, సుల్తానా, రమేష్, రమాదేవి, రమ, ఇసాక్‌అలీతో పాటు తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులను వదిలిపెట్టేదిలేదు

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట : 'గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కొందరు అక్రమార్కులు గుట్టలను, ఇతర భూములను కబ్జా చేసి పేదలకు అన్యాయం చేశారు. వారిని వదిలిపెట్టేదిలేదు. చట్టపరంగా అన్ని బయటికితీసి వారి భరతం పడతా' అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ధ్వజమెత్తారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. మండలంలో అపార ఖనిజ సంపద ఉందని దాన్ని కాపాడుతానని అన్నారు. సంపద నుంచి వచ్చే సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ నిధులను నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. భూపాలపల్లి జిల్లాలోని గాంధీనగర్ గుట్టను కొందరు నాయకులు కాజేయగా అధికారుల సహకారంతో ఆ భూమిని కాపాడి రూ. 200కోట్లతో విద్యార్థుల చదువు కోసం ఇంటిగ్రేట్ భవనాలు నిర్మిస్తున్నామన్నారు. అధిక వర్షాలతో నియోజకవర్గంలో 124 చెరువులకు నష్టం వాటిల్లిందని, ఈ అంశం సీఎం దృష్టికి తీసుకెళ్లి 122 చెరువుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. వర్షాకాలం పంటల వరకు శాశ్వత పనులు పూర్తి చేస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు కష్టపడి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి సీఎం రేవంత్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలన్నారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు.

పార్టీలో చేరిన పలువురు

మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌లు సామల సౌమ్యమధుసూదన్, గుర్రం రవీందర్, చేనేత సొసైటీ చైర్మన్ దాసరి కుమారస్వామి, మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి కుమారస్వామి, బేతు ఆదిరెడ్డి, సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, జలేందర్‌రెడ్డి, రాజ్‌కుమార్, తిరుపతి, మాజీ వార్డు సభ్యులు సుధాకర్, శంకర్, భద్రయ్య, తిరుపతి, సారంగపాణి, మహేందర్‌రెడ్డితోపాటు 200మంది ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చల్లా చక్రపాణి, పరకాల మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రవి, శాంతరవి, కృష్ణమూర్తి, రాజమౌళితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

వాజేడు: వేసవి ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యంపై జాగ్రత్తలను పాటించాలని పేరూరు వైద్యాధికారి రాహిల్ అన్నారు. మండల పరిధిలోని పెద్ద గంగారంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 40 మందిని పరీక్షించి అవసరం ఉన్న వారికి మందులను అందించారు. ఒకరికి జ్వరం ఉండగా ఆరుగురికి ఒంటి నొప్పులు ఉన్నట్లు గుర్తించారు. వైద్య సిబ్బంది హెచ్‌వీ లక్ష్మి,,ఏఎన్మ్ సుమ, హెచ్ఏ తిరుపతి రావు, ఆశవర్కర్లు ఉన్నారు.